క్లుప్తంగా

సామాజిక తనిఖీలో రూ.31వేల రికవరీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

దేవనకొండ: సామాజిక తనిఖీలో రూ.31,141 రికవరీ చేశామని డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభను ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 2022–23లో 1,226 పనులకు రూ.9,72,66,288 ఖర్చు చేయగా రూ.31,141 అవినీతి జరిగిందని తేల్చారు. ఈ మొత్తాన్ని రికవరీ చేసినట్లు చెప్పారు. జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి, ఏపీడీ పద్మావతి, అడిషనల్ పీఈడీ సలీంబాషా, డ్వామా ఎఫ్ఎం అదెయ్య పాల్గొన్నారు.

రేపు జయంతి ఉత్సవాలు

మద్దికెర: మండలంలోని చౌడేశ్వరీ దేవాలయంలో ఈనెల 17వ తేదీ సోమవారం చౌడేశ్వరి మాత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పెద్దకోట్ల రమేష్ శనివారం తెలిపారు. ఉదయం గంగపూజ, గణపతి పూజ, ప్రత్యేక పూజలుంటాయని చెప్పారు.

మొక్కలు పంపిణీ

దేవనకొండ : ఉపాధి హామీ పథకం కింద వందశాతం సబ్సిడీతో పండ్ల మొక్కలను అర్హులైన రైతులకు అందిస్తామని జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి అన్నారు. శనివారం దేవనకొండలో ఆయన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. 2,343 కొబ్బరి మొక్కలు, 4,620 మామిడి మొక్కలను వివిధ గ్రామాల రైతులకు అందజేశారు. వీటిని పెంచుకుని పండ్లతోటల సాగులో రాణించాలని ఆయన సూచించారు.ఏపీడీ పద్మావతి, ఏపీఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పొలం బడితో అధిక దిగుబడి

తుగ్గలి : పొలం బడి కార్యక్రమాల ద్వారా పంటల సాగులో మెళకువలు తెలుసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంపీఈవో అజారుద్దీన్ తెలిపారు. మండలంలోని రాంపల్లిలో శనివారం వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. పంట మార్పిడి, సేంద్రియ ఎరువుల వాడకం, విత్తన శుద్ధి, తెగుళ్ల నివారణ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. వేరు శనగ సాగులో తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు.

సభ్యుల తీర్మానం మేరకే అభివృద్ధి పనులు

మద్దికెర : పంచాయతీ సభ్యులు తీర్మానం పొందిన తరువాతే అభివృద్ధి పనులు చేపడతామని ఈఓ శ్రీహరి తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరిన్ని కాలనీలలో పైపులైన్లు వేయాలని కోరుతున్నారని, నీటి నిల్వ సామర్థ్యాన్ని బట్టి చర్యలు చేపడతామన్నారు. నిధులు వచ్చిన వెంటనే సీసీ రోడ్లు వేస్తామని చెప్పారు.

మెనూ పాటించండి

చిప్పగిరి: మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ బాలనాయుడు ఎండీఎం ఏజెన్సీని ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీపీ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 34వ వార్డులో అనారోగ్యంతో వడ్డే రంగయ్య మృతి చెందగా వైఎస్సార్ బీమా తక్షణ ఆర్థిక సాయంగా రూ.10వేలను మృతుడి భార్య సుజాతకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రమేష్ శనివారం అందజేశారు. సచివాలయ సిబ్బంది ఇమ్రాన్, కృష్ణ పాల్గొన్నారు.

కాన్పుల వార్డును ప్రారంభించాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన నవజాత,కాన్పుల వార్డును వెంటనే ప్రారంభించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు భాస్కర్‌యాదవ్, చిన్నన్న కోరారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి నెల ఆస్పత్రిలో 250 నుంచి 300ల వరకు ప్రసవాలు జరుగుతున్నాయన్నారు.

మొహర్రం నిర్వహణకు విరాళం

చిప్పగిరి: మండలంలోని బంటనహాలు గ్రామంలో మొహర్రం నిర్వహణకు రూ.20వేలు విరాళం ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ శనివారం గ్రామస్తులకు అందజేశారు. గ్రామంలో స్థల వివాదంతో 7 సంవత్సరాలుగా మొహర్రం నిర్వహించడం లేదు. విషయాన్ని మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లగా ఆయన గ్రామస్తుల మధ్య ఏకాభిప్రాయం వచ్చేలా చేశారు. శనివారం చిప్పగిరి ఎస్ఐ రమేష్ బాబు గ్రామస్తులకు మొహర్రంపై పలు సూచనలు చేశారు.

సమస్యలపై సీపీఎం జీపు జాత

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించేందుకు సీపీఎం జీపు జాత నిర్వహిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని తేరుబజారు సర్కిల్ వద్ద సీపీఎం జిల్లా నాయకుడు గోవిందు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీపు జాతను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

పొలాల్లో హలాల సవ్వడి

- కురిసిన వర్షం..కదిలిన కాడి
- వేరుశనగ, ఉల్లినాట్లలో రైతన్నలు బిజీ



జొహరాపురంలో ఉల్లినాటు వేస్తున్న వ్యవసాయ కూలీలు

నందవరం : వరుణుడు పలకరిస్తున్న వేళ.. పొలాల్లో హలాల సవ్వడులు, కూలీల సందడి మొదలైంది. జోరుగా ఉల్లినాట్లు సాగుతుండటంతో పొలాలన్నీ కళకళలాడుతున్నాయి. నదీతీర ప్రాంతం, బోరు, బావుల కింద రైతులు ఉల్లినాట్లకు దిగారు. గంగవరం, జొహరాపురం, సోమలగూడూరు, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, కనకవీడు, పూలచింత గ్రామాల్లో నాట్లు మొదలయ్యాయి. ఇప్పటి వరకు మండలంలో 250 ఎకరాల్లో ఉల్లి నాట్లు వేశారు. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరగుతుండటంతో రైతులు ఉల్లి సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు, పుప్పాలదొడ్డి, కైరుప్పల, ములుగుందం, కారుమంచి, డి.కోటకొండ, బనవనూరు, చెన్నంపల్లి, వెంగళాయదొడ్డి గ్రామాల్లో శనివారం రైతులు వేరుశనగ విత్తనం వేశారు. రెండు రోజులు క్రితం ఆయా గ్రామాల్లో మోస్తరు వర్షం పడటంతో రైతులు విత్తనం వేయడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనానికి అనుకూలంగా ఉన్నాయని, ఇలాగే కురిస్తే నెలాఖరు నాటికి విత్తన ప్రక్రియ పూర్తవుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. వర్షాలు వస్తే ఈనెలాఖరు వరకు వేరుశెనగ విత్తనం వేసుకోవచ్చని ఆలూరు ఏడీఏ సునీత తెలిపారు.

తుగ్గలి : రెండు రోజుల క్రితం మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు పొలం బాట పట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం మంచి వర్షాలు కురవలేదు. అరకొరగా కురిసిన వర్షాలకు ఇప్పటికే పలు గ్రామాల్లో కంది, ఆముదం, పత్తి, వేరుశనగ పంటలు సాగు చేశారు. పదునైన వర్షం లేకపోవడంతో తుగ్గలి చుట్టు పక్కల గ్రామాల రైతులు విత్తనం వేయలేకపోయారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి పదును కావడంతో వేరుశనగ విత్తన సాగులో అన్నదాతలు బిజీ అయ్యారు. ఆలస్యంగా పదును కావడంతో పప్పుశనగ విత్తనం విత్తుకునే ఆలోచనలో ఉన్న నల్లరేగడి రైతులు వేరుశనగ విత్తనం వేసేందుకు ఆసక్తి చూపడం లేదు.



నారును సిద్ధం చేస్తున్న కూలీలు,





పుప్పాలదొడ్డి, మామిళ్లకుంట వద్ద వేరుశనగ విత్తనం వేస్తున్న రైతులు

ఓటరు జాబితా సవరణ పక్కాగా చేయండి



మాట్లాడుతున్న ఈఆర్వో మల్లికార్జున

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణ పక్కాగా చేయాలని ఆలూరు అసెంబ్లీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జున తెలిపారు. శనివారం మడలంలోని 47 మంది బీఎల్ఓల (బూత్ లెవల్ ఆఫీసర్లు)తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్ఓలు వారి పరిధిలో ఉన్న ఇంటింటికీ వెళ్లి ఫారం-6 (కొత్త ఓటర్లు) స్వీకరించాలన్నారు. అలాగే ఫారం-7 మార్పులు చేర్పులు, ఫారం-8 అడ్రస్ మార్పులు స్వీకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే మరణించిన వారి ఓట్లును తొలగించాలని, తప్పులకు తావు లేకుండా జాబితా సవరణ చేయాలని చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో స్త్రీలు 1,22,885 మంది, 1,26,299 మంది పురుషులు, 49 మంది ట్రాన్స్‌జెండర్స్ ఓటరర్లు ఉన్నట్లు వివరించారు. ఏఈఆర్వో రామాంజనేయులు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బసవన్న గౌడ్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



టీఎస్ కూళ్లూరులో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు, లబ్ధి తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. పనుల కోసం పట్టణాలకు గ్రామీణ ప్రజలు రానవసరం లేదని, వారికి అవసరమై ప్రభుత్వ సేవలన్నీ గ్రామ సచివాలయాల ద్వారా అందజేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను అందచేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ శాంతమ్మ, ఎంపీటీసీ పద్మమ్మ, నాయకులు హనుమంతు, మాధవస్వామి, వెంకటేష్, బడేసాబ్, సత్యన్న, దస్తగిరి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



పెద్దహోతూరులో సిబ్బందిని ప్రశ్నిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

ఆలూరు: ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో మార్పులు రావాలని, ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి పనిచేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోగలమని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. శనివారం పెద్దహోతూరు, హాలహర్వి గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్, కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి రాబట్టారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే బడిబయట విద్యార్థులు మిగిలిపోయారని అసహనం వ్యక్తం చేశారు. నాడు–నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆర్‌జేడీ, కృష్ణారెడ్డి, డీఈఓ రంగారెడ్డి, పీఓ డాక్టర్ వేణుగోపాల్, జేడీఓ సునీత, ఆలూరు, హాలహర్వి ఎంఈఓలు కోమ లాదేవి, చిరంజీవిరెడ్డి, ఈరన్న, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

హాలహర్వి: స్థానిక కేజీబీవీని శనివారం రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ తనిఖీ చేశారు. పాఠశాలలో అందుతున్న విద్య, సౌకర్యాలపై ప్రిన్సిపాల్ పద్మావతిని ఆరా తీశారు. మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, నియమించాలని కోరుతూ జెడ్పీటీసీ లింగన్న వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



చిప్పగిరిలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ కోరారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ గోవిందరాజులు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో 23 మంది వలంటీర్లు ఉండగా కేవలం 13 మంది హాజరయ్యారు.అంతేకాకుండా జగనన్న సురక్ష లో భాగంగా అప్పగించిన బాధ్యతలు సక్రమంగా చేయడం లేదని సర్పంచ్, గ్రామస్తులు సభ దృష్టికి తెచ్చారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం 1,354 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ, కన్వీనర్ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి బాలన్న,శ్రీదర్,రాజన్న పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



దీప్తి ట్రేడర్స్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో శనివారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు, కర్నూల్ స్పెషల్ టీం అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీ వెంకట రాజేశ్వరి ట్రేడర్స్, త్రివేణి ఆగ్రోస్ ఎంటర్‌ప్రైజెస్, శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, చంద్ర ట్రేడర్స్, దీప్తి ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు చేసి రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. విజిలెన్స్ సీఐ పీటీ. కేశవరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కావటంతో అనుమతి లేని ఎరువులు, రసాయన మందులు, సీడ్స్ విత్తనాల అమ్మకాలపై నిఘా ఉంచామని, ఇందులో భాగంగా ఆయా దుకాణాలకు అనుమతులు ఉన్నాయా లేదా, అనుమతిలేని రసాయన పురుగు ముందులు విక్రయిస్తున్నారా అనేది పరిశీలిస్తున్నామని చెప్పారు. షాప్‌లో ఉన్న స్టాక్కు, రికార్డుల్లో ఉన్న వివరాల్లోని తేడాలను పరిశీలించారు. శ్రీ వెంకట రాజేశ్వరి ట్రేడర్స్‌లో రూ. 3,37,788, త్రివేణి ఆగ్రోస్ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ. 1,93,659, చంద్ర ట్రేడర్స్‌లో రూ.26,443, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌లో రూ.47,040ల విలువజేసే విత్తన, రసాయన ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు, వీటికి సంబంధించిన ధ్రువ పత్రాలు చూపించి అమ్మకాలు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కర్నూల్ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ రవూఫ్, శిఖరరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలోని ఊరి కొండపై చిరుత పులి ఉన్న సమాచారం తెలుసుకున్న ఆదోని సెక్షన్ ఆఫీసర్ మణిధర్ నాయుడు శుక్రవారం రాత్రి గ్రామానికి చేరుకుని గ్రామస్తులను అడిగి చిరుత సంచరించిన స్థలాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొండల్లో ఉన్న వానరుల వేట కోసం చిరుత వచ్చి ఉంటుందన్నారు. కొండల్లో చిరుత..వానరాలు, జింకలు, కుక్కలను వేటాడుతుందన్నారు. మనుషుల జోలికి రాదని, తనపై దాడి చేస్తారేమోననుకుప్పుడు మాత్రమే మనుషులపై దాడి చేస్తుందని చెప్పారు. పొలాలకు వెళ్లే కూలీలు, రైతులు, గొర్రైలు, పశువుల కాపురులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉన్నతాధికారులకు వివరాలు తెలియజేస్తానన్నారు.

తప్పుడు వార్తలపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ రూరల్: తమపై తప్పుడు వార్తలు రాసిన ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు సాబ్దిన్ నూర్‌బాషా సీఐ మురళీ మోహన్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయా దినపత్రికల విలేకరులు తనపై దుష్ప్రచారం చేస్తూ పరువు, మర్యాదలకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూ వివాదానికి సంబంధించిన అంశాన్ని పక్కదారి పట్టిస్తూ రాజకీయ కోణంలో వక్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం నాయకులు అమాస్, మహబూబ్‌బాషా ఉన్నారు.

రీ సర్వే పరిశీలన

వెల్దుర్తి: మండలంలోని కలుగొట్ల, పుల్లగుమ్మి, బుక్కాపురంలో జరుగుతున్న వైఎస్సార్ జగనన్న భూ రీ సర్వే రికార్డులను తహసీల్దార్ రాజేశ్వరి శనివారం పరిశీలించారు. అనంతరం కలు గొట్ల ఆర్బీకే కార్యాలయంలో రీసర్వే టీడీ దీపిక, సర్వేయర్లు, వీఆర్ఓలతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు వారు చేపట్టిన సర్వే వివరాలను తెలుసుకున్నారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించి, పలు సూచనలు చేశారు.

జేసీ కోర్టు ఆర్ఓఆర్ కేసులపై విచారణ

కర్నూలు(సెంట్రల్):జాయింట్ కలెక్టర్ కోర్టులో మూడు ఆర్ఓఆర్ కేసులపై శనివారం విచారణ జరిగింది. కర్నూలు, హాలహర్వి, గోనెగండ్ల మండలాలకు సంబంధించిన కేసులపై జేసీ నారపురెడ్డి మౌర్య ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఆయా కేసులకు సంబంధించి ఫిర్యాదు దారులు, కక్షిదారులు, వారి తరపు లాయర్లు హాజరై తమ తమ వాదనలను వినిపించారు.



కరోనా వేళ కూడా సేవలందించారు..

కరోనా సమయంలో ప్రభుత్వ సేవలు నిలిచిపోరాదని వలంటీర్లు జట్టుగా ఏర్పడి పథకాలు అమలు, సేవలు అందిచేందుకు ప్రాణాలకు తెగించి కృషి చేశారు. ఇందులో భాంగా 2021 కోవిడ్ సమయంలో అంగన్‌వాడీల ద్వారా ప్రతి నెల అందించే పౌష్టికారం సరఫరా నిలిచిపోరాదని రాష్ట్ర ప్రభుత్వం వారికి పౌష్టికాహారం అందించింది. కోవిడ్ విస్తృతంగా ఉన్న సమయంలో వలంటీర్లు సృజన్,అహ్మద్, అంగన్‌వాడీ కార్యకర్త లీలావతి కలిసి లబ్ధిదారులకు 8 రకాల పౌష్టికాహారంతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఇలా తమకు ఆ సమయంలో చేసిన సేవలను గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

– ఆలూరు రూరల్



ఆలూరులోని ఎల్లార్తి రోడ్డులో పద్మావతి అనే గర్భిణికి పౌష్టికాహారం కిట్ అందిస్తున్న వలంటీర్లు

కోవిడ్‌లో అండగా



2021లో నేను గర్భిణిని. కరోనా వల్ల లాక్‌డౌన్‌తో ఎవరూ బటయకు రాలేని పరిస్థితి. ఇక గర్భిణులు, బాలింతలను కనీసం ఇంటి నుంచి బయటకు పంపేవారు కాదు. ఈ క్రమంలో నా పరిస్థితి కూడా అదే. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే పౌష్టికాహార ఇంటి అందదేమో అనుకున్నా. అయితే వలంటీర్లు, సృజన్,అహ్మద్ ప్రతి నెలా అంగన్‌వాడీ టీచర్‌తో వచ్చి నాకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఆ సమయంలో వారు ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి సేవలందజేశారు. వారి సేవలకు ఎన్ని కృతజ్ఞతలు తెలిపినా తక్కువే.

– పద్మావతి,మహిళ,ఆలూరు

ఆపదలో ఆదుకున్నాడు..

ఈ ఫొటోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పేరు తలారి నరసప్ప. ఈయన ఆలూరులోని కోట వీధిలో నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రిలో చేరాడు. మూడు నెలల పాటు ఆసుపత్రిలో ఉండిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు చుట్టుముట్టాయి. అయితే తన విషయం తెలుసుకొని గ్రామ వలంటీర్ రఫీక్ దాదాపు 80కి.మీ. దూరం వచ్చి పింఛన్ సొమ్ము అందజేశాడు. ఆ సొమ్ము చేతికందడంతో కొంత ఆర్థికంగా ఊరట లభించింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు అభినందనలు చెప్పారు. ఇప్పటికీ ఆ కుటుంబం వలంటీర్ సేవలను మర్చిపోలేదు.

– ఆలూరు రూరల్



విశ్వభారతి ఆస్పత్రిలో నరసప్పకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రఫీక్

మా వలంటీర్ సేవలు మరవలేం



నాకు ఎద్దు పొడిచి ఎడమ కాలు విరిగి నడుముపై భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం కర్నూలు సమీపంలోనున్న విశ్వభారతి ఆస్పత్రిలో చేరాను. ఆరోగ్య శ్రీ కింద చికిత్సపొందా.. ఈ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. మా వలంటీర్ రఫీక్ ఆసుపత్రికి వచ్చి నాకు పింఛన్ సొమ్ము అందించాడు. నేను డిశ్చార్జ్ అయ్యే వరకు ప్రతి నెల ఆస్పత్రికి వచ్చి నా పింఛన్ డబ్బుల ఇచ్చి వెళ్లేవాడు. ఆయన సేవలు మరువలేనివి.

– నరసప్ప, ఆలూరు

జగనన్నతోనే వాల్మీకుల అభ్యున్నతి



మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసిన పొగాకు రామచంద్ర

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే వాల్మీకుల అభ్యున్నతి సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మంత్రి నివాసంలో శనివారం రాష్ట్ర వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి మాట్లాడుతూ వివిధ జిల్లాలోని నిరుద్యోగ, యువతీ, యువకులకు ప్రభుత్వం సూచనలు, సహాల మేరకు వారికి జీవనోపాధిని కల్పించేందుకు కృషి చేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ సమన్వయకర్త ప్రవీణ్, పాదయాత్ర నటేష్, కుమార్ ఉన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధే ధ్యేయం

వెల్దుర్తి: జిల్లా సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా దశల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు నగేశ్, నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించు జీపుజాతాలు, 26 నుంచి 31వ తేదీల్లో ఆదోని నుంచి కర్నూలు జిల్లా కేంద్రానికి మహాపాదయాత్ర చేపడుతున్నామని, అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 17న వెల్దుర్తిలో జరిగే జీపుజాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజు, మారెన్న, చిన్న ఏసు, పెద్దన్న, సత్యం పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు



ఎమ్మిగనూరులో ధ్రువ పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు



కారుమంచిలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ కుమారస్వామి



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు పథకాలు అందుతాయని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, తహశీల్దార్ గంగిరెడ్డి పేర్కొన్నారు.శనివారం పట్టణంలోని ఇందిరానగర్, హెచ్‌బీఎస్ కాలనీల్లోనున్న సచివాలయల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి ధ్రువ పత్రాలు అందజేశారు. మున్సిపల్ ఆర్ఓ బేబి, నాయకులు పాల్గొన్నారు.

హాలహర్వి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారమవుతాయని తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంథోనీ అన్నారు. శనివారం మండలంలోని అమృతాపురం, బల్లూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లను పలువురికి పంపిణీ చేశారు. సర్పంచ్ మారెన్న, ఎంపీటీసీ గాదిలింగప్ప పాల్గొన్నారు.

గోనెగండ్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. శనివారం మండలంలోని పెద్దనేలటూర్–2, తిప్పనూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, నరసమ్మ పాల్గొన్నారు.

దేవనకొండ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారమవుతాయని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ గౌరీదేవి అన్నారు. శనివారం మండలంలోని జిల్లెడబుడకల, పి.కోటకొండ గ్రామాల్లో సర్పంచ్ బండమీది తిమ్మక్క ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ అలంకొండ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆస్పరి: కారుమంచి గ్రామంలో శనివారం సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ చంద్రకళ, బనవనూరులో సర్పంచ్ పెద్దరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కారుమంచిలో 150, బనవనూరులో 85 సర్టిఫికెట్లను తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ అందజేశారు.

వెల్దుర్తి: మండలంలోని పుల్లగుమ్మిలో డీటీ ప్రసాదరాజు, ఈఓఆర్డీ నరసింహులు ఆధ్వర్యంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, నాయకులు నాగార్జున రెడ్డి, అచ్యుతానందరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు ధ్రువ పత్రాలు అందజేశారు.

కృష్ణగిరి: ప్రజా సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని సర్పంచ్ బోయ సర్వేశ్వరి అన్నారు. మండలంలోని అమకతాడు, టి. గోకులపాడు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీఓ విశ్వమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 425 మందికి ధ్రువ పత్రాలు అందించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

గాలివానకు కూలిన విద్యుత్ స్తంభం

నందవరం: మండలంలోని జొహరాపురం గ్రామంలో శనివారం కురిసిన గాలి వానకు మూడు విద్యుత్ స్తంభాలు, ఒక చెట్టు నేలకూలింది. గ్రామంలో బసవరాజ రెడ్డి ఇంటి ముందు గేదెలను విడిపించబోయే సమయంలో స్తంభం, చెట్టు కూలింది. అయితే ఎవరికీ ఏమీ కాలేదు. స్తంభం కూలడంతో గ్రామంలో కాసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

శిథిల గదులను తొలగించండి

మద్దికెర : స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు గదులు శిథిలావస్థకు చేరి ఇబ్బందిగా మారాయని, అలాగే విద్యార్థినులు ఆటలు ఆడుకునేందుకు అడ్డుగా ఉన్నాయని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఏఈ మోహన్‌నాయక్‌కు హెచ్ఎం దేవేంద్రప్ప శనివారం కోరారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ విషయాన్ని డీఈఓ, జిల్లా సీఈఓ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

యునానీ వైద్య శిబిరం

ఎమ్మిగనూరుటౌన్: ముఖామి జమాతే అహలేహదీస్, సలాఫి బైతుల్ మాల్ ఆధ్వర్యంలో స్థానిక మదరెసా ఏ దారుసలాంలో శనివారం ఉచిత యునానీ వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో150మందికి యునానీ వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మౌలానాఉమ్రి, మూసజమాయి,మనియార్ అమానుల్లా ఉన్నారు.

మలేరియా ప్రబలకుండా చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న నూకరాజు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మలేరియా జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు ఫీవర్ సర్వేలు చేయాలని జిల్లా మలేరియా నివారణ శాఖ అధికారి నూకరాజు సూచించారు. శనివారం పట్టణంలోని ఎంఎస్ నగర్, శిల్పా ఎస్టేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డ్రైడే గురించి ఆరా తీసి దోమలు, లార్వాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.